క్లుప్తంగా

నేడు రేణుక యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దొరసానిపల్లెలో వెలిసిన శ్రీరేణుకా యల్లమ్మ తల్లి ఆలయంలో మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. అలాగే లోక కళ్యాణార్థం కలశ స్థాపన, గణపతి, నవగ్రహ, రుద్రహోమం, చండీ హోమం, ఆయుష్ హోమంలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం చేయనున్నారు. అలాగే సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీ చేస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం కలుగుతుందని కామనూరు పీహెచ్‌సీ డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. 'ఆయుష్మాన్ భారత్–అందరికీ ఆరోగ్యం' కార్యక్రమంలో భాగంగా శనివారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సైకిల్ వాడకం వల్ల బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి వ్యాధులు రాకుండా రక్షణ పొందవచ్చని తెలిపారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, స్టాఫ్‌నర్స్ విజయమ్మ, సిబ్బంది సరోజ, మధు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడంతో ఆరోగ్యానికి మేలు

అట్లూరు : సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని స్థానిక వైద్యాధికారి డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ విశ్వంత్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్–అందరికీ ఆరోగ్యంలో భాగంగా శనివారం అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సైకిల్ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సైకిల్ తొక్కడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీకృష్ణ, పీహెచ్‌ఎన్ లక్ష్మిదేవి, స్టాఫ్‌నర్సు సులోచన, ఫార్మాశిస్టు సురేష్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

దువ్వూరు : వేసవి శిక్షణలో భాగంగా దువ్వూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు కథలు, స్పోకెన్ ఇంగ్లీషు, క్యారంబోర్డు, చెస్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు ఆయన వివరించారు. శిక్షణలో 26 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్ఠమాసం మూడవ శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

స్వాములకు ప్రత్యేక పూజలు



రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాముల ఆలయాల్లో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు సంజీవరాయ అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

5న ఎరువుల తయారీపై శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో 5వ తేదీన వానపాముల ఎరువు తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి గల రైతులు 8096888039 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్ : రహమతుల్లావీధిలోని ఆధ్యాత్మిక క్షేత్రమైన చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఈనెల 4 నుంచి 6వ తేది వరకు నిర్వహించనున్నామని దర్గా ముతవల్లీ అమీరున్నీసా తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం తహలీల్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఖవ్వాలీ కచేరీ ఉంటుందని వివరించారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం


పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోరుమామిళ్ల : స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలో శనివారం పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పసుపు రైతులకు లబ్ధి చేకూర్చేందుకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, బయట మార్కెట్‌లో పసుపు ధర తక్కువగా ఉండటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించలేదన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.6850తో ఒక్కో రైతు వద్ద 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తుందన్నారు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో రైతుల వద్ద సుమారు 600 మెట్రిక్ టన్నుల పసుపు ఉందన్నారు. ఈ పసుపును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పోరుమామిళ్లలోని డీసీఎంఎస్‌కు పసుపుతెచ్చి అమ్ముకోవాలన్నారు.కార్యక్రమంలో ఉద్యానవన శాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాదరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ గోపి, మార్కెట్ యార్డు చైర్మన్ పుత్తా లక్ష్మిదేవి, మేనేజర్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సిఎం బాషా, రంగసముద్రం, టేకూరుపేట సర్పంచులు రవిప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలు తెలుసుకుని సహకరించండి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా వాటిని అందించేందుకు వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని ఉద్యానవన శాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం పోరుమామిళ్ల మండల పరిధిలోని ఆర్‌బీకేల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులతో సమావేశమై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను రైతుల ముంగిటకు చేర్చాల్సిన బాధ్యత ఆర్‌బీకేలకు ఉందన్నారు. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు, రసాయన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. బయట మార్కెట్ కన్నా ఆర్‌బీకేలలో సరుకులు ఎమ్మార్పీరేటుకే లభిస్తాయని రైతులకు చెప్పాలన్నారు. ఇక్కడ వేసే పంటల గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పసుపు బయట మార్కెట్‌లో చాలా తక్కువ ధరకు అడుగుతున్నారని, మార్క్‌ఫెడ్‌లో రూ.6,850 ఇస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు కల్పించేందుకే మార్క్‌ఫెడ్ ద్వారా కొనేలా చర్య తీసుకున్నామన్నారు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో సుమారు 600 మెట్రిక్‌టన్నుల పసుపు ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీఏ మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని తొకలపల్లెలో శ్రీరామసేవా సమితి ఆధ్వర్యంలో కాటసాని బ్రదర్స్ నిర్మించిన తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం ప్రారంభించి మాట్లాడారు. వాటర్‌ప్లాంట్‌ను దాదాపు రూ.5లక్షలు వెచ్చించి నిర్మించి గ్రామస్తులకు శుద్ధినీటిని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం కాటసాని వెంకటరెడ్డి వితరణగా ఇచ్చిన 150 వాటర్‌క్యాన్లను గ్రామస్తులకు ఎమ్మెల్సీ అందజేశారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్లకు పేరు తేవాలి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో తైక్వాండో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎన్నికైన సాయిప్రీతి, సంగా భవ్యలను ఆయన అభినందించి పోరుమామిళ్లకు పేరు తేవాలని కోరారు. తైక్వాండో మాస్ట ర్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ (తై క్వాండో) జరుగుతున్నాయని, అందులో సాయిప్రీతి, భవ్య లు పాల్గొంటున్నారన్నారు. గత డిసెంబర్‌లో రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఢిల్లీ జాతీయ పోటీలకు ఎన్నికయ్యారన్నారు.

పురాతన ఆలయానికి మహర్దశ

- రూ.64 లక్షల టీటీడీ నిధులతో అభివృద్ధి పనులు
- నేటి నుంచి సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు


ఆలయ ప్రధాన ద్వారంలో నూతనంగా నిర్మించిన గాలిగోపురం

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి పురాతన ఆలయానికి పునర్వైభవం లభించింది. సుమారు 600 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని రూ.64 లక్షల టీటీడీ నిధులతో అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి 5 రోజుల పాటు సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.64 లక్షలు మంజూరు

మట్లి రాజుల కాలంలో సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం, విమాన గోపురం జీర్ణమై శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో నూతనంగా గాలిగోపురం, విమాన గోపురంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక నాయకులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల దృష్టికి తీసుకెళ్ళగా వారు ఈ విషయాన్ని బద్వేలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టీటీడీ అధికారులకు ఆదేశాలు ఇవ్వగా వారు రూ.64 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులలో రూ.40 లక్షలతో విమాన గోపురం, గాలిగోపురం నిర్మించారు. మరో రూ.24 లక్షలతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

రికార్డులు నిర్వహించకుంటే గుర్తింపు రద్దు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : స్కానింగ్ సెంటర్లలో రికార్డులు నిర్వహించకుంటే గుర్తింపు రద్దు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం లింగనిర్ధారణ నిషేధ చట్టంపై నిర్వహించిన సబ్‌డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. లింగనిర్ధారణ చేస్తే స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తామని చెప్పారు. గర్భిణుల వివరాలను ఫారం ఎఫ్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా సెంటర్లను నిర్వహించరాదని తెలిపారు. అర్హత లేని వ్యక్తులు స్కానింగ్ చేస్తే ముందస్తు నోటీసు లేకుండానే సెంటర్‌ను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, గైనకాలజిస్టు డాక్టర్ శ్రీవాణి, రేడియాలజిస్టు డాక్టర్ నాగరాజు, వైద్యాధికారులు ఇళయరాణి, సునీల్, మార్టిన్, దినేష్, షాహీన, కీర్తి, హాజీర, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జయమ్మ, సీఓలు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బమ్మ, శ్రీదేవి, నాగజ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి


వనిపెంటలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసులరెడ్డి

మైదుకూరు : పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసులరెడ్డి అన్నారు. అభివృద్ధి పనులపై ఆయన మైదుకూరు సబ్ డివిజన్ కార్యాలయంలో శనివారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ మైదుకూరు, దువ్వూరు మండలాల్లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పనులు, సంక్షేమ హాస్టల్ భవనాల పనులు, నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సుచించారు. అంతకుముందు ఆయన వనిపెంటలో జరుగుతున్న నాడు–నేడు పనులను, దువ్వూరులో జరుగుతున్న సంక్షేమ హాస్టల్ పనులను పరిశీలించారు. సమావేశంలో పీఆర్ ఈఈ రామచంద్రారెడ్డి, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు ఏఈలు మధుసూదన్ బాబు, సుబ్రహ్మణ్యం, కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఐత్రంపేట, దంతెలపల్లె, విజయనగరకాలనీ గ్రామాల్లో ఆమె ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేయడం తమ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి తమ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు రామకోటి, వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు దుగ్గిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, ఓబయ్య, సుబ్బారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, పలు శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఎకోపార్కులో పర్యావరణంపై ఎగ్జిబిషన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో ఆదివారం మిషన్ లైఫ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్ఓ ఎన్‌వీ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణంపై పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్‌లను ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హాజరవుతారని సబ్ డీఎఫ్ఓ తెలిపారు. ప్రజలు పార్కులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు రాజీవ్ గాంధీ నేషనల్ పార్కు నుంచి అమ్మవారిశాల వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సమాజ హితం కోరే కాశీవరపు రచనలు

ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి


ఎదమీటిన రాగాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవులు, రచయితలు

ప్రొద్దుటూరు : కాశీవరపు వెంకటసుబ్బయ్య సమాజ హితం కోసమే రచనలు చేసే అభ్యుదయ కవి అని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి తెలిపారు. కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన 'ఎదమీటిన రాగాలు' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. స్థానిక రోటరీ క్లబ్ సభాభవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ మనిషి మనసులోని సంఘర్షణలను, వేదనలను, భావుకతను, ఆలోచనలను వ్యక్తీకరించే సాధనం కవిత్వమని అన్నారు. సామాన్యులైన, పండితులైన తన అంతరంగాన్ని ఆవిష్కరించడానికి కవిత్వాన్ని ఆశ్రయించాల్సిందేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని సంస్కరిస్తుందని తెలిపారు. విస్తృత పఠనం ద్వారా మనసు వికాసం చెందుతుందన్నారు. వైవీయూ ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి పుస్తకాన్ని సమీక్షించారు. రాయలసీమలోని కరువుగాయాన్ని, పెన్నా ఔన్నత్యాన్ని రికార్డ్ చేసిన కవి కాశీవరపు అని కొనియాడారు. పద్య కవి ఏసీ దస్తగిరి , కథా రచయిత తవ్వా ఓబుళరెడ్డి కాశీవరపు వెంకటసుబ్బయ్య కవితల గురించి ప్రస్తావించారు. కళాభారతి నాటక సంస్థ సభ్యులు కొత్తపల్లి శీను, కొమ్మిశెట్టి మోహన్, మహమ్మద్, ఖలందర్, కవులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా కుళ్లాయమ్మ బాధ్యతల స్వీకరణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఎంపీడీఓగా కుళ్లాయమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మైదుకూరులో పనిచేస్తున్న ఈమె ప్రొద్దుటూరుకు బదిలీకాగా, ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఉపేంద్రారెడ్డి చిత్తూరు జిల్లాకు పదోన్నతిపై ఎంపీడీఓగా వెళ్లారు. అలాగే ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డి పదోన్నతిపై ఎంపీడీఓగా చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న టైపిస్టు శ్రీలక్ష్మి బద్వేలు పీఆర్‌ఐ డివిజన్ కార్యాలయానికి బదిలీకాగా, కడప జెడ్పీ కార్యాలయం నుంచి జి.చంద్రకళ ఇక్కడికి వచ్చారు. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఆర్.కృష్ణకుమారిని రెగ్యులర్ పోస్టుపై ఇక్కడికే బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుళ్లాయమ్మ ఎమ్మెల్యే రాచమల్లును మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఆయుర్వేదిక్ యునాని వైద్య శిబిరం, అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత ఆయుర్వేదిక్ యునాని మెడికల్ క్యాంప్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్నాల్డ్ జిమ్ నిర్వాహకుడు షేక్ న్యామతుల్లా తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తొలిసారిగా ఆర్నాల్డ్ జిమ్ ఆధ్వర్యంలో కర్నాటకకు చెందిన హకీం అమనుల్లాఖాన్‌తో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, కీళ్లనొప్పులు తదితర వ్యాధుల వారికి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. మన ఇంటిలో వంట గదిలో లభించే వస్తువులతో ఎలా ఆరోగ్యంగా జీవించవచ్చో వివరిస్తారన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు అన్వర్‌బాషా, ముక్తియార్, శివ, షేక్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాగభూషణం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలపై హిందూపురంలో మే 31న ప్రారంభమైన జీపు జాతా శనివారం ప్రొద్దుటూరుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. సకాలంలో యూనిఫాం, నూనె, సబ్బులు, చెప్పులు, టవాల్స్ ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, నాగేంద్ర, ఏటీఎం నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, రవణమ్మ, గురమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, రవికుమార్, అరుణ్‌కుమార్, రవి, జాకోబ్, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.870 ఇళ్లు మంజూరు


కొండూరులో విచారిస్తున్న హౌసిగ్ పీడీ, డీఈ, ఏఈలు

అట్లూరు : జిల్లాలో జగనన్న కాలనీల ద్వారా 97.870 పక్కా ఇళ్లు మంజూరైనట్లు జిల్లా హౌసింగ్ పీడీ కృష్ణయ్య తెలిపారు. శనివారం అట్లూరు మండల పరిధిలోని కొండూరు గ్రామంలో పక్కాఇల్లు లబ్ధిదారుకు ఆధార్ అనుసంధానం వేరే వారిది కావడంతో వారి సమస్య పరిష్కార నిమిత్తం ఆయన వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 97.870 పక్కా ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికి 19.976 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. అలాగే 4.800 ఇళ్లు శ్లాబు పూర్తికాగా, 8.900 ఇళ్లు గోడలు పూర్తి అయ్యాయన్నారు. అలాగే 25 వేలు బేష్‌మెంట్లు పూర్తి కాగా మరో 24 వేలు ఇళ్లు పునాదులు తీసి మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఆయన వెంట డీఈ రాజారత్నం, స్థానిక ఏఈ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌లో తీవ్ర అసహనం చూశా

- కోడిగుడ్డు విసిరిన అమాయకుడిని చితకబాది, పోలీసులను దూషించారు
- లోకేష్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : నారా లోకేష్ పొరపాటున అధికారంలోకి వస్తే ఉద్యోగులను బతకనిస్తాడా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. పాదయాత్రలో ఆయన అసహనాన్ని, అసంతృప్తిని గమనించి తాను మాట్లాడుతున్నానన్నారు. నోటికొచ్చినట్టు వ్యక్తిగత ఆరోపణలు, అగిత్యాన్ని ప్రదర్శిస్తున్నాడని మండిపడ్డారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శివాలయం సర్కిల్‌లో పాదయాత్ర బహిరంగ సభ అనంతరం రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద ఆకతాయి కోడిగుడ్డును విసిరాడన్నారు. ఆ గుడ్డు లోకేష్ గన్‌మెన్‌పై పడిందని, వెంటనే ఆకతాయిని పట్టుకున్నారన్నారు. లోకేష్ సహనం, సమన్వయం కోల్పోయి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కుమారుడినని, రాష్ట్ర నాయకుడినని కోపానికి, ఆగ్రహానికి, ఆవేశానికి గురయ్యాడన్నారు. నాయకుడినని మరిచిపోయి రౌడీలాగా, గుండాలాగా దాడి చేయించాడని తెలిపారు. అక్కడున్న టీడీపీ నేతలు అతనిని ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. పోలీసులు ఆకతాయిని వారి చేతిల్లోంచి కాపాడేందుకు ప్రయత్నిస్తే వారిపై కూడా టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారన్నారు. విధి నిర్వహణలో ఉన్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీంలపై కూడా దూషణలకు దిగారన్నారు. రాచమల్లు ఆఫ్ట్రాల్ ఎమ్మెల్యే మాత్రమేనని అనడంతోపాటు మీరు ఎమ్మెల్యే ముడ్డి కడుగుతారా అని దూషించడం దారుణమన్నారు. లోకేష్ అహంకారానికి, రౌడీయిజానికి ఇదే నిదర్శనమన్నారు. రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్‌ను గాయపరిచారని తెలిపారు. అలాగే పట్టణంలోని గోపి రైస్ మిల్లు ప్రాంతంలో లోకేష్ స్వయంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే విమర్శించారు. 20 రోజుల ముందు ఆర్ట్స్ కాలేజి రోడ్డులో రోడ్డు నిర్మాణం కోసం కంకర, సిమెంటు వేశామని, ఇది పాదయాత్రకు అడ్డుగా వేశామని విమర్శించారన్నారు. శివాలయం సర్కిల్‌లో ఫ్లెక్సీలు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని పోలీసులు కోరితే వైఎస్సార్‌సీపీ కటౌట్‌లను తొలగించి రూట్ మ్యాప్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. అనవసరంగా టీడీపీ నేతలు తనపై వ్యక్తిగత విమర్శలు చేసి బురదజల్లే ప్రయత్నం చేశారని తెలిపారు. టీడీపీలో రాగి నయాపైసా విలువలేని, కౌన్సిలర్ టికెట్ కూడా గెలుచుకోలేని ప్రవీణ్, లింగారెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారన్నారు.

కడప జిల్లా వారికి భయం అంటే తెలియదు

ఎమ్మెల్యే రాచమల్లుకు తనను చూసి వారం రోజులుగా చలి జ్వరం వస్తోందని లోకేష్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. తానే కాదు, కడప జిల్లాలో ఎవరికి భయం అంటే తెలియదన్నారు. నియోజకవర్గంలో రూ.1600 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించామన్నారు. రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రూపాయి కూడా అభివృద్ధి చేయలేదని టీడీపీ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని వైఎస్సార్ హెల్ క్లీనిక్ కేంద్రం వద్ద శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి కావ్య మాధురి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ అరగంట సేపు అయినా సైకిల్ తొక్కటం ద్వారా ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. ఆరోగ్య జీవన విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మహాదేవ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఆరోగ్య పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఏఎన్‌ఎం స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలోని ఎస్సీ హాస్టల్ నూతన భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. ఈ భవన నిర్మాణాలకు రూ.27 లక్షలు మంజూరు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ రామచంద్రారెడ్డి, మండల ఏఈ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు

బద్వేలు అర్బన్ : ప్రతిరోజు సైకిల్ తొక్కడం వలన ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తెలిపారు. ప్రపంచ సైకిల్ డే సందర్భంగా శనివారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో సైకిల్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతిరోజు సైకిల్ తొక్కడం వలన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడటంతో పాటు బీపీ, షుగర్ వంటి వ్యాధులతో పాటు హృద్రోగ సమస్యలను అదుపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఎటువంటి అనుమతులు, అనుభవం లేకుండా ఆర్‌ఎంపీ వైద్యులుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పదుల సంఖ్యలో ఆర్‌ఎంపీ వైద్యుల అవతారంతో ఆసుపత్రులు ఏర్పాటు చేసుకుని వచ్చి రాని చికిత్సలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు ప్రవీణ్‌కుమార్, మహిళా కన్వీనర్ గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పర్మినెంట్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సరెండర్ లీవుల మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని తెలిపారు. ఆగస్టు 23 నాటికి జీపీఎఫ్ ఖాతాలు తెరుస్తామని ఇచ్చిన హామీని సత్వరమే అమలు చేయాలని, 12వ పీఆర్సీలో కోతలు లేకుండా మెరుగైన ఫిట్‌మెంట్‌ను ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ నాయకులు యేసోబ్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలు కనిపించ లేదా!

ప్రొద్దుటూరు :లోకేష్ పాదయాత్రలో ఎస్సీలు, దళిత క్రైస్తవులు కనిపించలేదా అని ఆయా సంఘాల నాయకులు స్నూకర్ భాస్కర్, ప్రకాశ్, చంద్రశేఖర్, చైతన్య, రాజన్న, కౌన్సిలర్ సత్యం తెలిపారు. శనివారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సీఎస్ఐ గోల్డెన్ జూబ్లి చర్చి కమిటీ హాలులో వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి ఆది నుంచి ఎస్సీలన్నా, దళిత క్రైస్తవులు అన్నా చిన్న చూపేనని తెలిపారు. బొల్లవరం నుంచి పట్టణంలో నారా లోకేష్ పాయాత్ర వీధుల వెంబడి జరిగిందన్నారు. ఆయన అమ్మవారిశాల, మసీదు, దర్గాకు మాత్రమే వెళ్లారని, మార్గం మధ్యలో చర్చిలు ఉన్నా వెళ్లలేదన్నారు. లోకేష్ వైఖరిని బట్టి చూస్తే వారికి ఎస్సీలన్నా, క్రైస్తవులన్నా గౌరవం లేదని అర్థమవుతోందన్నారు.